## క్లుప్తంగా

### నేడు డిజిటల్ అవేర్‌నెస్

నారాయణపేట రూరల్ : తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) ఆధ్వర్యంలో జిల్లాలో ఎంపిక చేసిన ఉన్నత పాఠశాలలతో బుధవారం డిజిటల్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు ఏఎంఓ విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. 9, 10వ తరగతుల విద్యార్థులందరికీఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తారని చెప్పారు. నర్వ, మక్తల్, మాగనూర్, కృష్ణ, ఊట్కూర్, నారాయణపేట మండలాల్లోని ప్రభుత్వ, జెడ్పీహైస్కూల్, ఎయిడేడ్, కేజీబీవీలకు వర్తిస్తుందన్నారు.

### విద్యుత్ కోతలతో దెబ్బతింటున్న పంటలు

మరికల్: వారం రోజుల నుంచి వరుసగా విద్యుత్ అంతరాయం ఏర్పడుతుండడంతో చేతికొచ్చిన పంటలు దెబ్బతింటున్నాయని రైతు సంఘాల నాయకులు యాదయ్య, నర్సిములు, శ్రీనివాస్‌లు అన్నారు. మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ తరచుగా గంటల తరబడి విద్యుత్ కోతలు విధించడం వల్ల వరిపంటలు దెబ్బతింటున్నాయని వాపోయారు. విషయంపై ఏఈ మాట్లాడుతూ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా కోతలు విధించామన్నారు. ప్రస్తుతం పూర్తయ్యాయని ఇక నుంచి సమస్య ఉండదన్నారు.

### ఆర్థిక సాయం

దామరగిద్ద: మండలంలోని ఉద్మల్‌గిద్దకు చెందిన విద్యార్థిని ఐశ్వర్యకు దామరగిద్ద రెయిన్‌బో పాఠశాల కరస్పాండెంట్ రాఘవేందర్ గౌడ్ రూ. 25 ఆర్థికసాయం అందించారు. ఐశ్వర్య మార్చి 19న పాఠశాల నుంచి విహార యాత్రకు వెళ్లి వచ్చి, దామరగిద్ద నుంచి ఇంటికి మేనమామ హన్మంతు ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడింది. ఆమె మేనమామ సైతం తీవ్రంగా గాయపడ్డాడు. ఈ మేరకు చికిత్స పొందుతున్న ఐశ్వర్యకు వైద్య ఖర్చుల నిమిత్తం తమ వంతుగా సాయం అందించామని కరస్పాండెంట్ అన్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నేడు సంత వేలం

ధన్వాడ: మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే సంతకు సంబంధిం వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ సిబ్బంది మంగళవారం తెలిపారు. సర్పంచ్ అమరేందర్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం ఉదయం వేలం ఉంటుందని పేర్కొన్నారు.


### 'పది' విద్యార్థులు సత్తాచాటాలి



నారాయణపేట రూరల్ : పట్టణంలోని బీసీ బాలికల వసతిగృహంలో ఉంటున్న టెన్త్ విద్యార్థినులకు మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీసీ వెల్ఫేర్ అధికారి కృష్ణమాచారీ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో వార్డెన్లు రేణుక, మంజుళ, మసూద్, టీచర్లు పాల్గొన్నారు.

మాగనూర్: రాబోయే పరీక్షల్లో పదో తరగతి విద్యార్థులు సత్తాచాటాలని ఎంఈఓ లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మంగళవారం పదోతరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



నారాయణపేట రూరల్ : పట్టణంలోని శ్రీహంసవాహిని ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు రాజేష్, యాజమాన్య సభ్యులు రాంరెడ్డి, సంతోష్, సుజాత, తిరుపతి, నర్సింహులు, టీచర్లు పాల్గొన్నారు.

కోస్గి: ముశ్రీఫా జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వ పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బోధనలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పాఠశాల తరపున బహుమతులు అందజేశారు. జీహెచ్‌ఎం రాములు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మాగనూర్: అడవిసత్యారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్ అన్నారు మంగళవారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి వారికి పాఠాలు బోధించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ వెంకటప్ప, ఉపాధ్యాయులు రాజు తదితరులు పాల్గొన్నారు.



# కొనసాగుతున్న కంటి వెలుగు

● మొత్తం 8913 మందికి పరీక్షలు

దామరగిద్ద: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు రెండోదశ కార్యక్రమం మండలంలో కొనసాగుతోంది. జనవరి 19న మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని మొత్తం 30 గ్రామ పంచాయతీలు ఉండగా, ఇప్పటివరకు 11 గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించారు. దామరగిద్ద, సజనాపూర్, మద్దెల్‌బీడ్, బాపన్‌పల్లి, క్యాతన్‌పల్లి, కందెన్‌పల్లి, ముస్తాపేట్, దేశాయ్‌పల్లి, అయ్యవారిపల్లి, యల్సన్‌పల్లి, చాకలోన్‌పల్లి గ్రామాలు అందులో ఉన్నాయి. ఇప్పటి వరకు 8913 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 1245 మందికి రీడింగ్ అద్దాలు పంపిణీ చేశారు. ఉద్మల్‌గిద్ద, ఆశన్‌పల్లి గ్రామాల్లో ప్రస్తుతం కార్యక్రమం కొనసాగుతోంది. మండలంలో రెండు బృందాలుగా కంటివెలుగు సిబ్బంది పనిచేస్తున్నారు. ఒక్కో బృందంలో ఒక వైద్యుడు, సూపర్‌వైజర్, నలుగురుఆశావర్కర్లు, ఇద్దరు ఏఎన్‌ఎంలు తదితరులు పనిచేస్తున్నారు. జూన్ వరకు అన్ని గ్రామాల్లో కార్యక్రమం పూర్తిచేస్తామని అధికారులు చెబుతున్నారు.



శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న వైద్యాధికారి



పరీక్షలు చేస్తున్న సిబ్బంది

**సద్వినియోగం చేసుకోండి**

మండలంలో రెండు బృందాలుగా కంటివెలుగు సిబ్బంది పనిచేస్తున్నారు. ఇప్పటివరకు 11 గ్రామాల్లో కార్యక్రమం పూర్తిచేశాం. మిగిలిన గ్రామాల్లోనూ జూన్‌వరకు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. కంటి సంబంధ సమస్యలతో బాధపడుతున్నవారు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– నాగజ్యోతి, వైద్యాధికారి, దామరగిద్ద

# సంపూర్ణ ఆరోగ్యానికి పౌష్టికాహారం



పెద్దకడ్మూర్‌లో మాట్లాడుతున్న అధికారులు

మక్తల్: పట్టణంలోని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సూపర్‌వైజర్ మహేశ్వరి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. హెచ్‌ఎం బాలప్ప, విజయలక్ష్మి, మంజుల, సూపర్‌వైజర్ మల్లేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు వెంకటమ్మ, చంద్రకళ, భాగ్యలక్ష్మి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నర్వ: కిషోర్‌బాలికలు సంపూర్ణ ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం పెద్దకడ్మూర్ ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ హెచ్‌ఎం నర్సిములు, అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

మాగనూర్: గజ్జరందొడ్డి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ పక్షంలో భాగంగా అవగాహన కల్పించారు. సూపర్ వైజర్ స్వర్ణలత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## పండుగల నిర్వహణపై డీజీపీ ఆరా

నారాయణపేట రూరల్ : జిల్లాలో జరిగే అన్ని రకాల పండుగలపై డీజీపీ మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా వివరాలు తెలుసుకున్నారు. ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు జిల్లాలో నిర్వహిస్తున్న రంజాన్, శ్రీరామనవమి, హనుమాన్‌జయంతి పండుగలకు సంబంధించి ఏర్పాటు చేయనున్న బందోబస్తు, ముందస్తు కార్యక్రమాల గురించి తెలియజేశారు. కోస్గి, నారాయణపేట, ఊట్కూర్, మక్తల్ వంటి ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా పెట్టినట్లు చెప్పారు. అనంతరం జిల్లాలోని పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నకిలీ విత్తనాల నిర్మూలన, గుట్కా, డ్రగ్స్ అమ్మకాలపై సూచనలు చేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరం పరిష్కరించడానికి పీపీ సలహా తీసుకోవాలన్నారు. సమావేశంలో సీఐలు రవిబాబు, సీతయ్య, శ్రీకాంత్‌రెడ్డి, జనార్ధన్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి, చిత్రంలో కసిరెడ్డి నారాయణరెడ్డి

ధన్వాడ: ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం వివిధ గ్రామాల్లో ఉన్న సమస్యలపై వివరాలు సేకరించారు. ఎన్నికల ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వనజ తదితరులు పాల్గొన్నారు.

మరికల్: బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు సూరటి చంద్రశేఖర్ భార్య అనురాధ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మంగళవారం ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల అధ్యక్షుడు తిరుపతయ్య, రాజవర్ధన్‌రెడ్డి, రాజేష్, కృష్ణారెడ్డి, గోవర్ధన్ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ధన్వాడ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ సభ్యులు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఎర్త్ యంగ్ లీడర్ కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞను చేశారు. డీఎస్‌ఓ భానుప్రకాష్, హెచ్‌ఎం రమేష్ శెట్టి పాల్గొన్నారు.

## వాలీబాల్ క్రీడాకారిణికి సన్మానం

మాగనూర్: వాలీబాల్ క్రీడాకారిణి అనన్య శ్రీనీ మంగళవారం మక్తల్ బ్రహ్మ కుమారీ ఈశ్వరీయా విద్యాలయంలో ఘనంగా సన్మానించారు. సంస్థ అధినేత దాది జానకి పుణ్య తిథి సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. కేరళ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తూ ఎన్నో రాష్ట్ర స్థాయి పోటీలలో అనన్య ప్రథమ స్థానంలో నిలుస్తూ వస్తోంది. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఒకేషనల్ కోర్సులతో స్వయం ఉపాధి

కోస్గి: విద్యార్థులు ఒకేషనల్ కోర్సులు చదవడం వల్ల స్వయంగా జీవనోపాధి పొందవచ్చునని స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ ట్రైనర్స్ ప్రశాంతి, జ్యోతి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఒకేషనల్ కోర్సులో భాగంగా విద్యార్థులను పట్టణంలోని కేబీఎస్ బ్యాంకు, కూలర్లు, వాటర్ హీటర్ సామగ్రి మరమ్మతు కేంద్రాల వద్దకు తీసుకువెళ్లి ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు వివరించారు.

## చెక్కు అందజేత

మక్తల్: బ్యాంకు ఖాతాదారులు ఇన్సూరెన్స్‌లను సద్వినియోగం చేసుకోవాలని జక్లేర్ ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ వినోద్ కూమార్ అన్నారు. మంగళవారం బాధిత మహిళ రామమ్మకు రూ. 12 లక్షల చెక్కును అందించారు. రామమ్మ భర్త సోమప్ప జక్లేర్ బ్రాంచ్‌లో బీమా చేశారని గత ఏడాది రోడ్డు ప్రమాదంలో మరణించారని అన్నారు. ఈ మేరకు ఆమెకు చెక్కు అందించామన్నారు. ఉపసర్పంచ్ సంగీత, నర్సిములు, బ్యాంకు సిబ్బంది సురేష్, ఇమ్రాన్, జీవన్, మధు, పూజారి కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# పశువుల సంత, తైబజార్ వేలం

● నిర్ణీత ధర ఎక్కువగా ఉండటంతో టెండర్ బహిష్కరణ

కోస్గి: స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం పశువుల సంత, తైబజార్‌లకు టెండర్ల ద్వారా వేలంపాటలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మ్యాకల శిరీష అధ్యక్షతన ఏర్పాటు చేసిన టెండర్ ప్రక్రియలో కమిషనర్ పూర్ణచందర్ రావు టెండర్లు నిర్వహించారు. తైబజార్ వేలం పాటలో ఏడుగురు పోటీపడ్డారు. రూ.22.04 లక్షలకు అత్యధికంగా పాట పాడి గండీడ్ దేవేందర్ టెండర్‌ను దక్కించుకున్నారు. పశువుల సంత కోసం ఏడుగురు దరఖాస్తు చేసుకుని పోటీలో పాల్గొన్నారు. ప్రభుత్వ నిర్ణీత ధరను రూ.94.53 లక్షలుగా నిర్ణయించడంతో కంపెనీ ధర ఎక్కువగా ఉందని టెండర్‌దారులు వేలం పాటను బహిష్కరించారు. నేడు బుధవారం మరోమారు పశువుల సంత కోసం టెండర్లు నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు. మూడుసార్లు టెండర్లు చేపట్టి, నిర్ణయించిన ధర రానిపక్షంలో మున్సిపల్ ఆధ్వర్యంలోనే పశువుల సంతను కొనసాగిస్తామన్నారు. కాగా గతేడాది పశువుల సంతను మ్యాకల రంజిత్ కుమార్ అత్యధికంగా రూ.90.05లక్షలు పాడి దక్కించుకున్నారు. తైబజార్‌ను దేవేందర్ రూ.27.55 లక్షలకు దక్కించుకున్నాడు. ఈ ఏడాది తైబజార్ రూ.5.51 లక్షలు మాత్రమే వచ్చింది. పశువుల సంత టెండర్లు మాత్రం బహిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, టెండర్‌దారులు పాల్గొన్నారు.



టెండర్లు నిర్వహిస్తున్న అధికారులు

## రీజియన్ చైర్మన్‌గా రమేష్‌రావు

మక్తల్: లయన్స్ క్లబ్ వార్షిక సమావేశంలో భాగంగా రిజియన్ చైర్మన్‌గా రమేష్‌రావును ఎన్నుకున్నారు. సికింద్రాబాద్ క్లాసిక్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో కార్యక్రమం నిర్వహించారు. రమేష్‌రావు ఎన్నికపై ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, క్లబ్ మక్తల్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, డీవీచారీ, అంజన్‌ప్రసాద్, శ్రీరామ్, కొండయ్య తదితరులు అభినందించారు.

## పాఠశాలల తనిఖీ

మక్తల్: చందాపూర్, తిర్మలాపూర్ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను మక్తల్ జెడ్పీహెచ్‌ఎస్ జీహెచ్‌ఎం అనిల్ గౌడ్ మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు మెరుగైన బోధనను అందించాలని అన్నారు. ఉపాధ్యాయులు హెచ్‌ఎం ప్రణేష్ చారీ తదితరులు పాల్గొన్నారు.

## 31 వరకు గడువు

మరికల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న ఆయుష్మాన్ భారత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఆయుష్మాన్ భారత్ మేనేజర్ దిలీప్‌కుమార్ అన్నారు. మంగళవారం మరికల్‌లో ఆయుష్మాన్ భారత్‌కు దరఖాస్తులు చేసుకుంటున్న సరళిని పరిశీలించారు. 31 వరకు గడువు ఉందని అర్హులు ఉపయోగించుకోవాలని కోరారు.

## విగ్రహాల ఏర్పాటుకు విరాళం

నర్వ: మండలంలోని రాయికోడ్‌లో మహాత్మజ్యోతిబా పూలే, సావిత్రిబాయిపూలే విగ్రహాల ఏర్పాటుకు విండో చైర్మన్ బంగ్లాలక్ష్మీకాంత్‌రెడ్డి మంగళవారం విరాళం అందించారు. ఈ సందర్భంగా రాయికోడ్‌లో విగ్రహ కమిటీకి రూ.21 వేలు అందించారు. బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు నారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసే బీఆర్‌ఎస్‌లో చేరికలు



కోస్గి: నూతన మండలం గుండుమాల్ పరిధిలోని అప్పాయపల్లికి చెందిన ఉప సర్పంచ్ బుజ్జమ్మతో పాటు పలువురు వార్డు సభ్యులు, కాంగ్రెస్‌కు చెందిన మరో 50 మంది మంగళవారం ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలతో సన్మానం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసే, పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే ఈ సందర్భంగా అన్నారు. ఎంపీపీ మధకర్‌రావు, నాయకులు వెంకటేష్, లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు.

## ఎస్‌ఐ నరేందర్‌కు రివార్డు

మాగనూర్: జిల్లా ఎస్పీ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా మాగనూర్ ఎస్‌ఐ నరేందర్ మంగవారం రివార్డు అందుకున్నారు. కేసుల దర్యాప్తును త్వరగతిన పూర్తి చేసి కోర్టులలో చార్జిషీట్ దాఖలు చేసిన నేపథ్యంలో రివార్డు వరించిందని తెలిపారు. మక్తల్ సీఐ సీతయ్య, మాగనూర్ సిబ్బంది, ప్రజలు ఆయనను అభినందించారు.

## కరపత్రాల విడుదల



**నారాయణపేట రూరల్ : ఎస్పీ బాలసుబ్రమణ్యం ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30న బోరబండ లక్ష్మీ తిమ్మప్పస్వామి ఆలయంలో నృత్య సంగీత విభావరి నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం లయన్స్‌క్లబ్ గవర్నర్ హరి నారాయణ్‌బట్టడ్, రెడ్‌క్రాస్ అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి చేతుల మీదుగా కరపత్రాలు, వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. డాక్టర్ గందె కార్తిక్, సరాఫ్‌నాగరాజు, ఓంప్రకాష్, కాకర్లభీమయ్య పాల్గొన్నారు.**

## పరీక్ష సామగ్రి అందజేత

మద్దూరు: కొత్తపల్లి మండలంలోని నిడ్జింత, భూనీడ్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు కంపాక్స్, పెన్నులు, పెన్సిల్స్, హాల్ టికెట్ కవర్లు తదితర పరీక్ష సామగ్రిని బీజేపీ మండలాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ఆధర్యంలో మంగళవారం అందజేశారు. ఎంఈఓ గోపాల్‌నాయక్ పాల్గొని వారిని అభినందించారు. పాఠశాల హెచ్‌ఎం రఘు, నాయకులు తిరుపతిరెడ్డి, శేఖర్, రవిగౌడ్ పాల్గొన్నారు.

# గ్రంథాలయం పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

ఊట్కూర్: గ్రంథాలయాల అభివృద్ధికి కృషిచేస్తామని జిల్లా గ్రంథాలయ చైర్మన్ శాసం రామకృష్ణ అన్నారు. గ్రంథాలయంలో 'మౌలిక వసతులు కరువు' కథనం ఆదివారం సాక్షిలో ప్రచురితం కావడంతో ఆయన స్పందించారు. ఊట్కూర్‌లోని గ్రంథాలయాన్ని మంగళవారం పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలపై అటెండర్ రమేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడారు. విద్యుత్ సౌకర్యంతో పాటు మౌలిక వసతులు కల్పిస్తానని అన్నారు. త్వరలో కంప్యూటర్‌లు ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. అదేవిధంగా పులిమామిడిలో గ్రంథాలయం భవనం నిరుపయోగంగా ఉందని ఆయన దృష్టికి తీసుకురాగా అక్కడ సర్పంచ్‌తో మాట్లాడి భవనాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటానని అన్నారు.



ఊట్కూర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ శాసం రామకృష్ణ

## ఘనంగా బీరప్ప ఉత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

ఊట్కూరు: మండలంలోని పగిడిమర్రిలో బీరప్ప ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఎల్లమ్మ బందారు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పుర వీధుల్లో బోనాల ఊరేగింపు చేపట్టారు. ఐదేళ్లకు ఒకసారి జరిగే ఉత్సవాలకు హైదరాబాద్, పూణె తదితర నగరాలు, పట్టణాల నుంచి కుర్వ కులస్తులు అధికసంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో భక్తులకు తాగునీటి వసతి కల్పించారు. సర్పంచ్ సులోచన, మాజీ సర్పంచ్ బసవరాజుగౌడ్, కార్యదర్శి నాగిరెడ్డి, నాయకులు మురళీధర్‌రెడ్డి, విష్ణుమూర్తిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 'టికెట్ ఎవరికి వచ్చినా కలిసి పనిచేస్తాం'

నర్వ: మక్తల్ నియోజకవర్గ టికెట్‌ను పార్టీ ఎవరికి ఇచ్చినా కలిసి పనిచేస్తామని కాంగ్రెస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి నాగరాజుగౌడ్ అన్నారు. మంగళవారం నర్వలో పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అరుణకుమార్, సంజీవరెడ్డి, రామన్‌గౌడ్, కొండయ్య, రాములు పాల్గొన్నారు.

## సీసీ పనులు ప్రారంభం

మద్దూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లిలో ఉపాధి హామీ కింద రూ.6 లక్షలతో సీసీరోడ్డు, పంచాయతీ నిధులు రూ. 4లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులను సర్పంచ్ వంచెర్ల గోపాల్ మంగళవారం ప్రారంభించారు. గ్రామంలోని మణికంటి రవికుమార్ ఇంటి నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు పనులు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ దారిలో డ్రెయినేజీ వ్యవస్థ లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రెండు పనులు ఏకకాలంలో చేయిస్తున్నామని వివరించారు.

## నేడు బహుమతుల ప్రదానం

నారాయణపేట రూరల్ : జిల్లా స్థాయిలో టెన్త్ విద్యార్థులకు గత నెలలో నిర్వహించిన పూసల్ పహడ్ ట్యాలెంట్ టెస్ట్ విజేతలకు బుధవారం బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు శేర్‌కృష్ణారెడ్డి తెలిపారు. మొదటి మూడు స్థానాలలో నిలిచిన వారికి నగదు, మిగతా వారికి ప్రశంసాపత్రాలు అందిస్తామన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులు హాజరుకావాలన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

దామరగిద్ద: క్యాతన్‌పల్లి సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు గుర్తించి స్టేషన్‌కు తరలించారు. మంగళవారం మధ్యాహ్నం లింగాల్ చేడ్ నుంచి ట్రాక్టర్ యజమాని చంద్రప్ప ఇసుక తరలిస్తుండగా తనిఖీలో ఎలాంటి పత్రాలు లేకపోవడంతో ఎస్‌ఐ శ్రీనివాస్‌రావ్ చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలుంటాయన్నారు.

# ప్రజల చెంతకే వైద్యం : ఎమ్మెల్యే చిట్టెం



రాయికోడ్‌లో పల్లె దవాఖానను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

నర్వ: ప్రభుత్వం పల్లె దవాఖానాల ఏర్పాటుతో ప్రజల చెంతకే వైద్యం తీసుకొచ్చిందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాయికోడ్‌లో పల్లె దవాఖాన నూతన భవనాన్ని, మిషన్‌భగీరథ ట్యాంకును ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు విద్య, వైద్యం, సాగు, తాగునీరు వంటి మౌలిక వసతులతో పాటు రైతు బంధు, రైతుభీమా వంటి అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చిన ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. అనంతరం రాజుపల్లిలోని గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎంపీపీ జయరాములుశెట్టి, జెడ్పీటీసీ సభ్యురాలు గౌనిజ్యోతి, విండో చైర్మెన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వీణావతి, విండో డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీఓ రమేషకుమార్, పీహెచ్‌సీ వైద్యులు కృష్ణప్రియ, వెంకటరమణ, సర్పంచ్ సుశీల తదితరులున్నారు.

మక్తల్: పట్టణంలో మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేకు నిర్వాహకులు సన్మానం చేశారు. మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రవిశంకర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, వాకిటి శాంతి, పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

మాగనూర్: సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరమని ఏఎస్‌ఐ మన్నన్ అన్నారు. ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డయల్ 100 పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరైనా సేబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోతే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 155629 కు కాల్ చేసి సమాచారం ఇస్తే స్పందించి 24 గంటల లోపు డబ్బులు తిరిగి ఇప్పిస్తామన్నారు. సిబ్బంది రాజశేఖర్ రెడ్డి, ఉమేష్‌గౌడ్, ఖాజా, నీలయ్యగౌడ్ పాల్గొన్నారు.

## విత్తనాల ధరలు తగ్గించాలి

మరికల్: పెంచిన పత్తి విత్తనాల ధరలను వెంటనే తగ్గించాలని కాంగ్రెస్ నాయకులు కృష్ణయ్య, రామకృష్ణ, హరీష్, మొగులప్పలు డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ విత్తనాల ధరలు పెంచి రైతులపై భారం మోపుతున్నారని ఆరోపించారు. గత ఏడాది ఉన్న ధరలకే విత్తనాలను విక్రయించి రైతులను ఆదుకోవాలన్నారు.